సాక్షి ఒడిశా

గురువారం । 16 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,51,226లు, బంగారం 8 గ్రాముల 900 మిల్లీగ్రాములు, వెండి 4గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

దీపావళి తేదీ గందరగోళం పరిష్కారం

భువనేశ్వర్: రాష్ట్రంలో దీపావళి వేడుకల తేదీపై ఉన్న గందరగోళం తొలగిపోయింది. పూరీలోని ముక్తి మండప్ పండిత మహాసభ దీపావళి, పాయ శ్రాద్ధలను ఈ నెల 20న జరుపుకుంటామని ప్రకటించింది. వివిధ క్యాలెండర్లలో వేర్వేరు తేదీల వల్ల ఏర్పడిన చర్చకు ముక్తి మండపం పండితుల సభ అధికారిక ప్రకటన జారీ చేసింది. పండిత మహాసభ ప్రకారం, అక్టోబర్ 21న అమావాస్య కేవలం 14 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఇది దీపావళిని జరుపుకోవడానికి అశుభకరం. జ్యోతిష్య శాస్త్ర గణనల ఆధారంగా దీపావళి, పాయ శ్రాద్ధా ఆచారాలు అక్టోబర్ 20న మధ్యాహ్నం 3.23 గంటల నుండి ప్రారంభించాలని పండిత సభ ప్రకటించింది. అక్టోబర్ 21న దీపావళి జరుపుకోవడం సాంప్రదాయ హిందూ నిబంధనలకు అనుగుణంగా ఉండదని పండితులు స్పష్టం చేశారు. పురాతన గ్రంథాల ఆధారంగా పండితులు మరియు జ్యోతిష్యులు చాంద్రమాన క్యాలెండర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ఈ నిర్ణయానికి వచ్చినట్లు వివరించారు. అక్టోబర్ 20ని దీపావళిగా పరిగణించి ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

ఐసీడీఎస్ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

రాయగడ: గుణుపూర్‌లో కొత్తగా నిర్మించిన ఐసీడీఎస్ కార్యాలయ భవనాన్ని సబ్ కలెక్టర్ అభిషేక్ దుదూల్ అనిల్ మంగళవారం ప్రారంభించారు. సమగ్ర శిశు వికాసానికి ఎంతగానో దోహదపడుతున్న ఐసీడీఎస్ సంస్థలో ఉన్న కార్యకర్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల సద్వినియోగానికి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా కోవిడ్ వంటి ఆపద కాలంలో వారు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మీనతీ దేవ్, సీడీపీవో సుశుమా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార వంటకాల ప్రదర్శన

రాయగడ: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో అన్నారు. స్థానిక సమితి కార్యాలయం సమావేశ మందిరంలో జాతీయ స్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు సకాలంలో సమతుల్యమైన ఆహారాన్ని అందివ్వాలని సూచించారు. ప్రాజెక్టు అధికారి మీతారాణి దాస్ మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకోకపోతే అనేక ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం పౌష్టికాహార వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా



ఇసుక రీచ్‌లు వద్ద దాడులు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో వంశధార నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై సబ్ కలెక్టర్ అభిషేక్ దుదూల్ అనిల్ కొరడా ఝులిపించారు. మంగళవారం ఆయన వంశధార నది వద్ద ఇసుక రీచ్‌లపై ఆకస్మిక దాడులను నిర్వహించారు. ఆయన దాడులు నిర్వహిస్తున్న సమయంలో దాదాపు 80పైగా ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేసే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అక్కడకు వెళ్లి పరిస్థితిని అధ్యయనం చేశారు. అయితే ఇసుకను తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేవని గమనించిన 22 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు.

చిత్రకొండ సమితిలో భారీ కలప పట్టివేత



అటవీ శాఖ వారు స్వాధీనం చేసుకున్న కలప చెక్కలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి గాజులమామిడి పంచాయతీ పరిధిలోని సింగారం అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి చిత్రకొండ అటవీ శాఖ రేంజర్ బలరామ్ నాయిక్ తన సిబ్బందితో కలపను పట్టుకున్నారు. ముంచిగ్‌పుట్ ప్రాంతానికి చెందిన సునధర్ ఖిలోను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు తుమ్మాలమమిడి గ్రామానికి చెందిన త్రినాథ్ హంతాల్‌గా తెలిపింది. ఆయన పరారీలో ఉన్నాడు. ఘటనా స్థలంలో 119 కలప చెక్కలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో టేకు ఎక్కువగా ఉందని రేంజర్ తెలిపారు.

‘గుణుపూర్-తెరువలి .. సర్వే పూర్తి చేయాలి’



దిశ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి, పక్కనే కద్రక, కలెక్టర్ కులకర్ణి తదితరులు

రాయగడ: గుణుపూర్-తెరువలి కొత్త రైల్వే నిర్మాణంలో భాగంగా సంబంధిత శాఖ అధికారులు చేపడుతున్న సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణం పనులు ప్రారంభించాలని దిశ చైర్మన్, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గుణుపూర్ నుండి తెరువలి కొత్త రైల్వే నిర్మాణంలో భాగంగా నయిరా మీదుగా గుడారి వరకు రైల్వే లైన్ అనుసంధానించి రాయగడకు కలపాలన్న ప్రతిపాదన గుర్తించి ప్రస్తావించారు. రాయగడ రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందినప్పటికీ అందుకు సంబంధించిన సౌకర్యాలు ప్రజలు పొందలేకపోతున్నారని ఉలక అన్నారు. అత్యవసర సమయంలో తాత్కాల్ టిక్కెట్ల కొరత తీవ్రంగా ఉందని సమావేశంలొ ప్రస్తావించి, దీనిపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కొరాపుట్-రాయగడ రైల్వే లైన్‌లో గల టన్నెల్‌ల వద్ద తరచూ మట్టి పెల్లలు జారిపడటం వంటి సమస్యలు తరచూ చోటు చేసుకుంటుండటంపై సమీక్షించిన ఆయన అందుకు మార్గంలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమత, దుర్గి-రాయిపూర్ ప్యాసింజర్ రైళ్లకు జమిడిపేటలో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. సదరు సమితి గుమ్మ ఘాటి మలుపులో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో గుమ్మ వద్ద టన్నల్ ఏర్పాటు చేస్తే ఈ ప్రమాదాలను కొంతమేర నివారించే అవకాశం ఉంటుందని, అందుకు సంబంధిత శాఖ అధికారులు చొరవ చూపాలని అన్నారు. అదేవిధంగా కైలాస్‌పూర్ ఘాటీ మలుపు కూడా అదే తరహా ఉందని అయితే ఈ ఘాట్ రోడ్డు వద్ద విద్యుద్దీకరణ చేస్తే ప్రమాదాల సంఖ్య అరికట్ట వచ్చని కోరారు. రాయగడ నుండి కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ వరకు గల రహదారిని మెరుగుపరచాల్సి ఉందని ఉలక అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సేవలు

జిల్లాలో గల 11 సమితుల పరిధుల్లో ఉన్న 136 గ్రామాలకు మొబైల్ సేవలు లేవని ఈ గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఉలక అన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణలో..

తప్పుడు సమాచారం తగదు: సీఈఓ



సీఈఓ అధ్యక్షతన వర్చువల్ వర్కుషాపు కార్యక్రమం

భువనేశ్వర్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియలో తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారంపై అనుబంధ వర్గాలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఆర్. ఎస్. గోపాలన్ తెలిపారు. ఎస్ఐఆర్ – 2026 సన్నాహాల్లో భాగంగా ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి ఆర్ఎస్ గోపాలన్ అధ్యక్షతన ఆన్‌లైన్ వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీఈఓ కార్యాలయం నుండి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారులు, మీడియా నోడల్ అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా గోపాలన్ ఎస్ఐఆర్ చొరవ లక్ష్యాలు, ప్రాముఖ్యతను అనుబంధ యంత్రాంగానికి వివరించారు. ఈ ప్రక్రియలో స్పష్టత, పారదర్శకతను నిర్ధారించేందుకు సమన్వయంతో కూడిన ప్రయత్నాలకు పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఈసీఐ నిష్పాక్షికంగా, అంకిత భావంతో పని చేయడంతో ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందింది. ఆ ఖ్యాతిని నిలబెట్టుకోవడానికి, తప్పుడు, తప్పుదారి పట్టించే సమాచారాన్ని సమర్థంగా ఎదుర్కోవడం చాలా ముఖ్యమని సీఈఓ అన్నారు. అర్హులైన ఏ ఓటరు పేరును జాబితా నుంచి తొలగించకూడదు. అనర్హుల పేర్లను చేర్చకూడదని ఆయన పునరుద్ఘాటించారు. డిప్యూటీ సీఈఓ లక్ష్మీ ప్రసాద్ సాహు బీహార్ నుండి ఉదాహరణలను ఉటంకిస్తూ సవరణ ప్రక్రియలోని కీలక అంశాలను ప్రస్తావించారు. బూత్ స్థాయి అధికారుల తప్పులు, నకిలీ జోడింపులు లేదా తప్పు దారి పట్టించే సమాచారాన్ని గుర్తించి తక్షణమే సరిదిద్దాలని అధికారులను కోరారు. అట్టడుగు స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక, డిజిటల్ వేదికల ద్వారా సీఈఓ కార్యాలయం నుండి ధృవీకరించిన సమాచారం, క్రమం తప్పకుండా పత్రికా ప్రకటనలను చురుకుగా వ్యాప్తి చేయాలని ఆయన జిల్లా సమాచారం, ప్రజా సంబంధాల శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రం అంతటా పారదర్శకత, కచ్చితత్వాన్ని కొనసాగించడానికి ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా సకాలంలో అమలు చేయాలని సీఈఓ ఆర్.ఎస్. గోపాలన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను సెప్టెంబర్ 26న ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

తుపాకీ, పిస్టల్, 350 కిలోల గంజాయి



పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఎస్పీ, తదితర పోలీసు అధికారులు

జయపురం: కొరాపుట్ జిల్లాలో నేరాలు నియంత్రిస్తున్నామని ఎస్పీ రోహిత్ బర్మ బుధవారం తెలిపారు. జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న అపరాధి నిరోధక అభిజాన్‌లో జిల్లా పోలీసులు 350 కిలోల గంజాయితో పాటు తుపాకీ, ఒక పిస్టల్‌లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ నెలలో 17కుపైగా కేసుల్లో నిందితులతో పాటు ఒక హార్డ్‌కోర్ నిందితుడిపై నాసా చట్టంలో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నేరాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌తో పాటు గంజాయి మాఫియా, హార్డ్‌కోర్ నేరస్తుడు లాల్ బహదూర్ దర్జీని అరెస్టు చేశామని, అతడిపై గతంలో 20 కిపైగా కేసులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. అతడి నుంచి ఒక తుపాకీ, ఒక పిస్టల్, 350 కేజీల గంజాయి పట్టుకున్నట్టు వెల్లడించారు. ఆయుధాలపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఒక పోలీసు టీమ్‌ను బీహార్‌కు పంపించినట్లు వెల్లడించారు. గతంలో ఒక బట్టీ ఆదాయ నేరస్తుల వ్యతిరేకంగా హెల్ప్‌లైన్ ప్రారంభించామని వెల్లడించారు. ఆ హెల్ప్‌లైన్ నంబర్ 94389 16918 జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కాశ్యప్ కార్యాలయంలో ఉందని వెల్లడించారు. ఈ హెల్ప్ లైన్‌ను సద్వినియోగం చేస్తున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీప్ కశ్యప్, జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్,పాడువ పోలీసు అధికారి అశోక్ కుమార్ పాల్గొన్నారు.



నేరస్తుని నుంచి స్వాధీనం చేసుకున్న పిస్టల్ తదితర వస్తువులు

బొణై మాజీ ఎమ్మెల్యే మృతి



హేమేంద్ర ప్రసాద్ మహాపాత్రో

భువనేశ్వర్: సుందరగడ్ జిల్లా బొణై నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే హేమేంద్ర ప్రసాద్ మహాపాత్రో (92) ఖుటుగాంవ్‌లో బుధ వారం మరణించారు. అతడు 1961, 67, 71లో వరుసగా 3 సార్లు స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా శాసన సభకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఈనెల 29న జాతీయ కార్యవర్గ సమావేశం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఈనెల 29వ తేదీన అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు రెండో జాతీయ కార్యవర్గ సమావేశం జరగనుంది. ట్రస్టు సభ్యులు, గుణుపూర్ ధర్మశాస్త అయ్యప్ప మందిరం సభ్యులు జి.అనంతరావు గురుస్వామి ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయ్యప్ప స్వామి మందిర ప్రాంగణంలో జరిగే ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఏడాది తొలిసారిగా శబరిమల సమీపంలోని పంబ, నీలక్కాల్ మధ్య ట్రస్టు తరుపున అయ్యప్ప భక్తులకు ఉచిత అన్న ప్రసాద సేవనం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నవంబర్ నుంచి మకర జ్యోతి దర్శనం వరకు అక్కడకు వచ్చే భక్తులకు ఈ సౌకర్యం లభిస్తుందని తెలిపారు.

భటగుడలో యువకుడి దారుణ హత్య



సంఘటన జరిగిన గ్రామంలో పోలీసులు



సంఘటన స్థలంలో రక్తపు మడుగులో దిలీప్ మృతదేహం, పక్కనే గాయాలతో లలిత్ మాఝి

- మరొకరికి గాయాలు
- పోలీసుల అదుపులో నిందితుడు



పోలీసుల అదుపులో నిందితుడు కునాల్

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి పరిధిలో గల భటగుడ గ్రామంలో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడిని దిలీప్ లెహర (24)గా గుర్తించారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం బిసంకటక్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. భటగుడ గ్రామంలో మెగా తాగునీటి ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ పనులను చేసేందుకు కాంట్రాక్టర్ వద్ద పనిచేసేందుకు లంజిఘట్‌కు చెందిన కొందరు కూలీలు ఇక్కడకు వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అంతా భోజనాలు చేసి పడుకునే సమయంలో ఒకే గదిలో దిలీప్ లెహర, కునాల్ లెహరలతొ పాటు లలిత్ మాఝిలు ఉన్నారు. వారిలో ఏదో విషయమై వాగ్వాదాలు కొనసాగాయి. దీంతొ కునాల్ అనే యువకుడు కోపోద్రిక్తుడై ఒక గొడ్డలి సాయంతో దిలీప్‌పై దాడి చేశాడు. అడ్డుకున్న లలిత్‌ను కూడా గాయపరిచాడు. తీవ్రగాయాలకు గురైన దిలీప్ సంఘటన స్థలం వద్దే మృతి చెందగా తీవ్ర గాయాలతో లలిత్ బయటపడ్డాడు. తోటి కూలీలు అక్కడ జరిగిన ఘటనను తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం హత్య చేసిన కునాల్‌లు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కునాల్‌లు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకాశ్ పడియామీకి ఘన స్వాగతం



బస్టాండ్ వద్ద ఆకాశ్‌కు స్వాగతం పలికిన ప్రముఖులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కొయా తెగకు చెందిన ఆదివాసి యువకుడు ఆకాశ్ పడియామీ అంధుల ఫుట్‌బాల్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాడు. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 4 వరకు కేరళలో జరిగింది. అంతర్జాతీయ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో భారత్ తరఫున ఈ గిరిజన యువకుడు ఆడాడు. మొత్తం ఆరు దేశాలు పాల్గొన్న పోటీల్లో పాల్గొన్నాడు. మంగళవారం స్వస్థలం అయిన మల్కన్‌గిరి చేరుకున్న ఆయనకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఆకాశ్ తన సొంత ఊరు అయిన గోరఖుంటా పంచాయతీ కృష్ణవార్డ్‌కు వెళ్లారు. అక్కడ ఆదివాసీలు నృత్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ పదియే కబాసీ, మాజీ సర్పంచ్ ఎరా పడియామీ, సమితి సభ్యులు దేవే మాడీ, అడమా మాడీ, సోమా మడ్కమి, సామాజిక కార్యకర్త దుర్గా త్రిపాఠీ తదితరులు పాల్గొన్నారు.



స్వగ్రామం ఆకాశ్‌కు స్వాగతం పలికిన మహిళలు

ఉత్సాహంగా జిల్లా స్థాయి శిశు మహోత్సవం

పర్లాకిమిడి:

వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు మన సంస్కృతి, ఆటలు, పాటలు మరిచిపోకుండా ఏటా నిర్వహిస్తున్న శిశు మహోత్సవాన్ని స్థానిక బిజూ కల్యాణ మండపంలో జిల్లా శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ శిశు మహోత్సవం మహక్, ఉత్సాహ్ పేరిట నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ఫాల్గుణీ మఝి విచ్చేసి ప్రారంభించగా, ఏడీఎం (రెవెన్యూ) మునీంద్ర హానగ, సీడబ్ల్యూసీ చైర్మన్ అశ్వినీ మహాపాత్రో, జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ బాలాశ్రమాలు, అనాథాశ్రమంలో వుంటూ చదువుకుంటున్న విద్యార్థులు కూడా పలు పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తంగా రోజంతా 22 పోటీలను నిర్వహించారు. విజేతలకు ఏడీఎం మఝి బహుమతులను అందజేశారు. వీరిని రాష్ట్రస్థాయికి పంపిస్తామని డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి తెలియజేశారు.



జిల్లా స్థాయి శిశు మహోత్సవంలో పాల్గొన్న ఏడీఎం (రెవెన్యూ) మునీంద్ర హానగ, ఏడీఎం ఫల్గుణీ మఝి, అశ్వినీ మహాపాత్రో తదితరులు



విద్యార్థుల జానపద నృత్యాల పోటీలు



పల్లె వెలుగు డ్యాన్స్‌లో విద్యార్థులు



పల్లె వెలుగు డ్యాన్స్‌లో భంగిమ



మహిషాసుర మర్దినీ పాటకు డ్యాన్స్

క్లుప్తంగా

సిక్కోలు పుస్తక మహోత్సవం లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో నవంబర్ 11 నుంచి 20 వరకు జరగనున్న సిక్కోలు పుస్తక మహోత్సవం సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాలు విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకాంక్షించారు. ఈ మేరకు తన చాంబర్‌లో సిక్కోలు పుస్తక మహోత్సవం లోగోను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహోత్సవం కన్వీనర్ కె.శ్రీనివాసు, సాంస్కతిక వైజ్ఞానిక కన్వీనర్లు పి.సుధాకరావు, గొంటి గిరిధర్, కామినాయుడు, దొంతం పార్వతీశం, కె.కూర్మారావు, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నాచు పెంపకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మత్స్యశాఖ అధికారులు

ఎచ్చెర్ల: బుడగట్లపాలెం సముద్రతీరంలో కప్పాఫైకస్ జాతి సముద్ర నాచు పెంపకంపై స్థానిక మత్స్యకార స్వయం సహాయక సంఘాల మహిళలకు బుధవారం మత్స్యశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నాచు పెంపకం చేపడుతున్నట్లు మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు వై.సత్యనారాయణ తెలిపారు. 50 మంది మహిళలకు 10 మంది మత్స్యకారులు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. నాచు కొనుగోలు చేసే బాధ్యత మత్స్యశాఖ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, మత్స్యశాఖ ఎఫ్‌డీవో రవి, జీఎఫ్ ప్రతినిధి శామ్యూల్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు చీకటి శ్రీరాములు, మహిళలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల్లో న్యాయ విజ్ఞానం విస్తృతంగా వ్యాప్తి చెందడానికి, చట్టాలపై అవగాహన పెంచడానికి పారా లీగల్ వలంటీర్లకు సమగ్ర శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పారా లీగల్ వలంటీర్లకు మ జిల్లా న్యాయ సేవా సదన్‌లో నాలుగు రోజుల ప్రత్యేక శిక్షణ బుధవారం ప్రారంభించారు. వివిధ పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, న్యాయవాదులు అన్నెపు భువనేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



సంతోష్ మృతదేహం

బూర్జ: ఆమదాలవలస–పాలకొండ ప్రధాన రహదారిలో నీలాదేవిపురం మలుపు వద్ద ద్విచక్ర వాహనం ముందుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి గోతులో పడటంతో యువకుడు దుర్మరణం చెందాడు. మృతుడు విజయనగరం జిల్లా గరివిడి మండలం చేరిపేటకు చెందిన కె.సంతోష్‌గా గుర్తించారు. అదే బైక్‌పై వెనుక కూర్చున్న నమ్మి కనకరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరు బుధవారం సాయంత్రం పార్వతీపురంలో ఓ శుభకార్యం ఫొటోషూట్ తీసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. హెచ్‌సీ ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తెలతాడు చోరీ

సంతబొమ్మాళి: బోరుభద్ర గ్రామంలో మార్పు అప్పన్నమ్మకు చెందిన రెండు తులాల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైనట్లు సంతబొమ్మాళి ఎస్‌ఐ వై.సింహాచలం తెలిపారు. బుధవారం ఉదయం అప్పన్నమ్మ తన కన్నవారిల్లు ఉన్న నగిరిపెంట గ్రామానికి వెళ్లింది. తిరిగి బోరుభద్ర వచ్చేందుకు నగిరిపెంట జంక్షన్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో పుస్తెలతాడు తెంచుకుని పారిపోయారు. బాధితురాలు కేకలు వేసినా చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆన్‌లైన్‌లో అన్న ప్రసాదంపై వివాదం



ఆన్ లైన్‌లో రూ. 49కే అన్న ప్రసాదం



సాంఘిక మాధ్యమాల్లో అన్న ప్రసాదం విక్రయం వ్యాపార ప్రకటన

భువనేశ్వర్: ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ రాష్ట్రంలో అత్యంత ప్రముఖ దేవాలయాల నుంచి అన్న ప్రసాదం అమ్మకం, ఇంటి ముంగిట డెలివరీ ప్రకటనలు ప్రసార చేసి వివాదంలో చిక్కుకుంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ ప్రకటన పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయం నుంచి అన్న మహా ప్రసాదం (ఒబొడ) మాత్రమే కాకుండా కెంజొహర్ జిల్లా ఘుటొగాంప్ మా తరిణి, బాబా అఖండలమణి, ఇతర ప్రముఖ దేవాలయాల అన్న ప్రసాదాలను కూడా ఆన్‌లైన్‌లో బట్వాడా చేస్తున్నట్లు ప్రకటించింది. ఒక్కో సెట్ ప్రసాదం ధర రూ. 49కు పరిమితంగా పేర్కొంది. ఈ ఆఫర్ కార్తీక మాసం పురస్కరించుకుని ఈ ప్రత్యేక సౌలభ్యం కల్పించినట్లు ప్రకటన ప్రసారం చేసింది. కార్తీక మాసం నెల రోజులపాటు ఈ సౌలభ్యం చెల్లుబాటు అవుతుందని తెలిపింది.

ఈ చర్య విస్తృత విమర్శలకు దారి తీసింది. పవిత్ర శ్రీ జగన్నాథ మహా ప్రసాదం లభ్యతని ఇలా దిగజార్చడం భక్తుల పట్ల విశ్వాస ఘాతం. భక్తుల మనోభావాలను సొమ్ము చేసుకుని నిలువునా దోచుకునేందుకు వినూత్న ప్రయత్నంగా విమర్శలు వ్యాపించాయి. ఆధ్యాత్మిక, ధార్మిక సంప్రదాయ విలువల్ని దిగజార్చే ఇటువంటి చర్యల పట్ల అధికార యంత్రాంగం కఠినంగా స్పందించాలని భక్త జనం అభ్యర్థిస్తుంది. ఇలాంటి ప్రకటనలు ఆలయ ప్రసాదాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక పవిత్రతను దెబ్బతీస్తాయని సర్వత్రా ఆవేదన వ్యక్తం అవుతుంది. భగవంతుని ఆశీర్వాదంగా భావించే పవిత్రమైన అన్న ప్రసాదాన్ని ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టే వస్తువుగా పరిగణించరాదని పలువురు మత పండితులు, ఆలయ నిర్వాహకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక సంప్రదాయాలను వ్యాపారాత్మకంగా మార్చడం ఎంత మాత్రం తగదని అభ్యర్థిస్తున్నారు. ఆన్‌లైన్ ఆహార డెలివరీ ఏజెంట్లు మాంసాహార ఆహార పదార్థాలతో కలిపి భగవంతుని అన్న ప్రసాదాల్ని డెలివరీ చేయడం ఆధ్యాత్మిక, ధార్మిక విలువల్ని నీరుగార్చడమే అవుతుందంటున్నారు. తక్షణమే ఈ దుశ్చర్యపై శ్రీ మందిరం పాలక మండలి స్పందించి ఆన్‌లైన్‌లో మహా ప్రసాదం విక్రయ ప్రకటనలకు కట్టడి చేయాలని కోరారు.

భర్త ఇంటి ముందు భార్య ఆందోళన



భర్త ఇంటి ముందు తల్లితో కలిసి ధర్నా చేస్తున్న కరిష్మా

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి నలగంతి పంచాయతీ ఎం.వి 72 గ్రామంలో భర్త ఇంటి ముందు భార్య బుధవారం ధర్నాకు దిగింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తాపస్ మండల్ అనే వ్యక్తి బీఎస్‌ఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2022లో ఎం.వి 61 గ్రామానికి చెందిన కరిష్మా విశ్వస్‌ను ప్రేమించాడు. తల్లిదండ్రుల అంగీకారంతో మల్కన్‌గిరిలోని మల్లికేశ్వర్ ఆలయంలో వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులు మల్కన్‌గిరిలో ఓ అద్దె ఇంటిలో కాపరం పెట్టాడు. అక్కడ నుంచి తరచూ తాపస్ తల్లిదండ్రులు సునంద మండల్, తుషార్ మండల్ వచ్చి కొడుకు, కోడలు మధ్య గొడవలు పెట్టేవారు. దీంతో భార్యను విడిచి పెట్టి తపాన్ విధులకు వెళ్లిపోయాడు. రెండేళ్లు గడిచిన తరువాత ఎం.వి 79 పోలీసు స్టేషన్‌లో తనకు భర్త వదిలేశాడని కేసు పెట్టింది. పోలీసులు కేసు నమోదు చేసి తపాన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. భర్యాభర్తలు కలిసి ఉండాలని కోర్టు ఆదేశించింది. కరిష్మాను తపాన్ భర్యగా, అత్తమామలు కోడలిగా అంగీకరించడం లేదు. దీంతో కరిష్మా భర్త ఇంటి ముందు వివాహ, కోర్టు ఇచ్చిన పత్రాలతో ధర్నాకు దిగింది. న్యాయం కోసం పోరాడుతోంది. కరిష్మాతోపాటు తల్లి కూడా ఉంది.

నృత్య పోటీలకు విశేష స్పందన



మాట్లాడుతున్న డీఈఓ మయాధర్ సాహు



కుటుంబ వ్యవస్థను ప్రతిబింబించే డ్యాన్సు

పర్లాకిమిడి: స్థానిక మహేంద్రగిరి పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా ముఖ్య శిక్షా కార్యాలయం, రాష్ట్ర ఉపాధ్యాయ ట్రైనింగ్, ఉన్నత విద్యామండలి (ఎస్.సి.ఈ.ఆర్.టి) ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నృత్య పోటీలు బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ముఖ్యశిక్షాధికారి మాయధర్ సాహు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి నృత్య పోటీల విజేతలకు రాష్ట్ర స్థాయికి పంపుతామన్నారు. అదనపు డీఈఓ గిరిధర్, డాక్టర్ ముర్ము, జిల్లా సైన్సు కోఆర్డినేటరు అంపోలు రవికుమార్, అంతర్జాతీయ ఒడిశా నృత్య కళాకారిణి డి.ప్రియాంక, హెచ్‌ఎం పూర్ణచంద్ర ప్రధాన్ పాల్గొన్నారు. మనో డ్యాన్సు, ఒడిస్సీ, సంబల్‌పురి నృత్యాలు అలరించాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఆదర్శ దాస్, డి.ప్రియాంక, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ వ్యవహరించారు. విజేతలకు డీఈఓ మాయాధర్ సాహు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



చేతి కర్రలతో అంధులు

- జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు



మాట్లాడుతున్న దివ్యాంగుడు నిరంజన్ బెహరా

పర్లాకిమిడి: దివ్యాంగులకు బస్సుల్లో, ట్రైన్‌లలో ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రపంచ వైట్ క్యాన్ డేను స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సైట్ సేవర్స్ సంస్థ, సమర్థ్ వికలాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వైట్ క్యాన్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సామాజిక భద్రతా అధికారి లక్కోజు సంతోష్ కుమార్, సమర్థ్ సంస్థ అధ్యక్షుడు నిరంజన్ బెహరా, పి.చిన్నారి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12 మందికి అంధులకు తెల్లని స్టిక్‌లు జిల్లా పరిషత్ చైర్మన్ అందజేశారు. వైట్ క్యాన్ అంటే వికలాంగుల చిహ్నం, ఒడిశాలో వికలాంగులకు 60 శాతం, 80 శాతం అంగవైకల్యమని సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో అలా లేదని, దీనిని ప్రభుత్వం సరిదిద్దాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 6433 మంది దివ్యాంగులు ఉండగా.. కేవలం 3050 మందికి నెలసరి భృతి రూ.3500లు లభిస్తుందని సీసీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎ.జగన్నాథ రాజు అన్నారు. ముగింపు సభలో దివ్యాంగుడు, సమర్థ్ సంస్థ కార్యదర్శి సంతోష్ మహరాణా అతిథులకు ధన్యవాదాలు తెలిపారు.


దశమంత్‌పూర్ ఆస్పత్రి పరిశీలన



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: దశమంత్‌పూర్ సమితిలోని ప్రభుత్వ ఆస్పత్రిని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత బుధవారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పారిశుధ్యం, మరుగుదొడ్లు, మందుల నిల్వలు, సిబ్బంది ఖాళీల కోసం వాకబు చేశారు. వైద్య శాఖ ముఖ్య అధికారులతో సమీక్ష చేపట్టారు. నూతనంగా వచ్చిన అల్ట్రా సౌండ్ యంత్రాన్ని ప్రారంభించారు. డాక్టర్లు నబ కిశోర్, దీపక్ కుమార్, ఎంపీ ప్రతినిధి పంకజ్ కుమార్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ స్వాతి, తదితరులు

రాయగడ: సైబర్ మోసగాళ్ల బారినపడి ఎంతో మంది మోసపోతున్నారని, సైబర్ నేరగాళ్ల బారి నుంచి రక్షించడంతో పాటు ఆయా నేరాల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అన్నారు. బుధవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఎస్డీపీఓ గౌరహరి, సైబర్ సెల్ డీఎస్పీ అవినాష్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైబర్ నేరాల బారి నుంచి అమాయక ప్రజల్ని కాపాడేందుకు ప్రభుత్వం సన్నహాలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించి సైబర్ నేరస్తుల బారి నుంచి ప్రజలను రక్షించడం మన కర్తవ్యంగా భావించాలన్నారు. సైబర్ నేరాలను అదుపులోకి తీసుకురావాలంటే విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయి నుంచి సమితి స్థాయి వరకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సైకిల్ ర్యాలీలు, వివిధ రకాల పోటీలను నిర్వహించాలన్నారు.

‘మత మార్పిడి వద్దు’



పాత బస్టాండ్‌కు చేరిన మంచ్ సభ్యులు



ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీ హరిజన మహిళలు



మత మార్పిడి వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న గ్రామీణ ప్రజలు



మత మార్పిడి వ్యతిరేక ర్యాలీలో గిరిజన నేతలు

జయపురం: దేశంలో మత మార్పిడులు ఆపాలని కొరాపుట్ జిల్లా అను సూచిత, జనజాతి సురక్షా మంచ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం మధ్యాహ్నం మత మార్పిడికి వ్యతిరేకంగా జయపురం అనుసూచిత జాతి, జనజాతి సురక్ష మంచ్ భారీ ర్యాలీ నిర్వహించింది. జయపురం పాత బస్టాండ్‌లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సురక్షా మంచ్ సభ్యులు కాషాయ జెండాలు చేపట్టి సమావేశమయ్యారు. అక్కడి నుంచి భారత మాతా జిందాబాద్, మత మార్పిడి బంద్ చేయాలి, మతమార్పిడి నిషేధ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక 26వ జాతీయ రహదారి ప్రధాన కూడలి, పట్టణ ప్రధాన మార్గం మీదుగా రథొపాడియకు చేరారు. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో పలువురు వక్తలు ప్రసంగిస్తూ మతమార్పిడి దేశ వ్యతిరేకమని, అందుచేత ప్రజలు మత మార్పిడిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

త్వరలో ప్రతి లబ్ధిదారునికి నెలకు 10 కిలోల బియ్యం

- పౌర సరఫరాల మంత్రి కృష్ణ చంద్ర పాత్రో

భువనేశ్వర్: ఆహార భద్రత రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం కోటా రెండింతలు చేయనున్నారు. ఈ యోచనపై ప్రభుత్వ పరిధిలో చర్చ జరుగుతోంది. ప్రతి లబ్ధిదారునికి నెలకు 10 కిలోల బియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం తలకు 5 కిలోల వంతున ఉచిత బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రేషన్ అరకొరగా ఉంటుందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. త్వరలో ఈ మేరకు ప్రకటన వెలువడుతుందని సమాచారం. జాతీయ ఆహార భద్రతా పథకం కింద రాష్ట్రంలో లబ్ధిదారులకు తలసరి 5 కిలోల బియ్యం అదనంగా లభించే అవకాశం ఉందని ఈ విషయంలో ముఖ్యమంత్రి స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మహంగా ప్రాంతంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆహార సరఫరా మంత్రి కృష్ణ చంద్ర పాత్రో ఈ విషయం తెలిపారు. లబ్ధిదారులకు తలసరి రేషన్ రెట్టింపు చేసి 10 కిలోల బియ్యం ఎలా అందించాలో ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. చర్చలు ఫలప్రదం అయితే తలసరి 5 కిలోలకు బదులుగా ప్రతి లబ్ధిదారునికి నెలకు 10 కిలోల బియ్యం లభించవచ్చు. స్వతంత్ర కార్యక్రమం కింద తలసరి 5 కిలోల బియ్యం అదనంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో సమగ్రంగా 3 కోట్ల 26 లక్షల మంది లబ్ధిదారులు ఇప్పుడు ఆహార భద్రతా పథకం కింద ఉన్నారు. వారిలో 19 లక్షల మంది రాష్ట్ర ఆహార భద్రతా పథకం కింద కొనసాగుతున్నారు. మిగిలిన వారు జాతీయ ఆహార భద్రతా పథకంలో ఉన్నారు.

ఈ- కేవైసీ చేయకపోతే రేషను రద్దు

ఆహార భద్రత లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఎవరైనా లబ్ధిదారుడు ఈ-కేవైసీ చేయకుంటే వచ్చే నెల నుంచి వారికి ఉచిత ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద ఉచిత బియ్యం సరఫరా నిలిపివేస్తారని, వారు బియ్యం పథకం లబ్ధి కోల్పోతారని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో 15 లక్షల 67 వేల మంది లబ్ధిదారులు ఈ - కేవైసీ చేయలేదని సమాచారం.

నువాపడా ఉప ఎన్నికలో బీజేడీ నవీన వ్యూహం

- బీజేడీ అభ్యర్థి స్నేహాంగిని చురియా



స్నేహాంగిని చురియా

భువనేశ్వర్: నువాపడా నియోజక వర్గం ఉప ఎన్నిక పురస్కరించుకుని రాష్ట్ర రాజకీయ వాతావరణం వేడెక్కింది. నామినేషన్ దాఖలు ఘట్టం ఆరంభం కావడంతో అభ్యర్థుల ఎంపిక పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అధికార పక్షం భారతీయ జనతా పార్టీ బీజేడీ ఫిరాయించిన జయ ఢొలొకియాను అభ్యర్థిగా ప్రకటించింది. మరో వైపు కాంగ్రెస్ ఘసిరాం మాఝీని బరిలోకి దింపింది. విపక్షం బిజూ జనతా దళ్ చిట్ట చివరి క్షణం వరకు అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో ఆశావహుల శీర్షికతో ఊహాగానాలు బలం పుంజుకున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నవీన్ నివాసంలో అంతరంగిక సమావేశాలు నిరవధికంగా కొనసాగాయి. ఎప్పటి మాదిరిగానే నవీన్ పట్నాయక్ తుది నిర్ణయం విశ్లేషకుల్ని సైతం ఖంగు తినిపించింది. నువాపడాలో గెలుపు గుర్రం అన్వేషణ కోసం నియమించిన స్నేహాంగిని చురియా నువాపడా ఉప ఎన్నికకు బీజేడీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు ప్రకటించారు. నవీన్ పట్నాయక్ నువాపడా ఉప ఎన్నికకు స్నేహాంగిని చురియాను ఎంపిక చేయడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. పశ్చిమ ఒడిశాకు చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు స్నేహాంగిని చురియా ప్రస్తుతం బిజూ మహిళా జనతా దళ్ అధ్యక్షురాలిగా పని చేస్తున్నారు. షెడ్యూల్డ్ కుల సమాజానికి చెందిన ఆమె సామాజిక సమ్మిళితత్వం, మహిళా సాధికారత రెండింటినీ సూచిస్తుంది. బీజేడీ రాజకీయ విజయ గాథలో ఈ రెండు ప్రధాన అంశాలు కావడంతో ఆమె అభ్యర్థిత్వం ధీటైనదిగా పరిగణించారు. పోటీలో ఉన్న మూడు ప్రధాన పార్టీలలో ఆమె ఏకైక మహిళా అభ్యర్థి. పోటీలో ఆమెకు ప్రత్యేక గుర్తింపును ఇస్తుంది. మహిళలపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా స్థిరమైన వైఖరికి పేరు గాంచిన స్నేహాంగిని చురియా రాష్ట్ర వ్యాప్తంగా బీజేడీ మహిళా విభాగంలో ముందంజ నాయకురాలిగా పేరొందింది. ఆమె క్షేత్ర స్థాయి సంబంధాలు, బీజేడీ మహిళా కార్యకర్తలను ఉత్తేజపరిచే సామర్థ్యం నువాపాడలో పార్టీ ప్రచారానికి శక్తినిస్తుందని భావిస్తున్నారు. నవీన్ పట్నాయక్ ఎంపిక నువాపడా ఉప ఎన్నికలో లింగ, ప్రాంతీయ, సామాజిక ప్రాతినిధ్యం వ్యూహాత్మక సమతుల్యతను ప్రతిబింబిస్తుంది. ఈ చర్య బీజేడీ మహిళా నాయకత్వంపై ప్రాధాన్యతను కూడా పునరుద్ఘాటిస్తుంది.

పురపాలికల్లో.. పడకేసిన పారిశుద్ధ్యం

- పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- పలుచోట్ల తూతూమంత్రంగా చెత్త సేకరణ
- పట్టణవాసులకు తప్పనిపాట్లు

పురపాలక సంస్థల పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. శ్రీకాకుళం కార్పొరేషన్‌తో పాటు ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస మున్సిపాలిటీల్లో చెత్తాచెదారాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి ఇదే పరిస్థితి ఉండటంతో కుక్కలు, పశువులు, పందువులు చేరి పరిసరాలను చిందరవందరగా మార్చుతున్నాయి. చెత్త సేకరణకు సంబంధించి డంపర్ బిన్లు పాడైపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందని సిబ్బంది చెబుతుండగా.. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు, అటువైపుగా వెళ్లే వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని పురపాలక సంస్థల పరిధిలో పారిశుద్ధ్యంపై ‘సాక్షి’ ఫోకస్..

శ్రీకాకుళం కార్పొరేషన్‌లో..



మాధవమోటార్స్ జంక్షన్ వద్ద నడిరోడ్డుపై ఉన్న డంపర్‌బిన్ వద్ద కుక్కలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. కార్పొరేషన్ పరిధిలో విలీన పంచాయతీలతో కలిపి 50 డివిజన్లు ఉన్నాయి. అందులో 1.85లక్షలు మంది జనాభా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్లీన్‌ఆంధ్రప్రదేశ్ వాహనాలు 50 ఉండేవి. వీటికి అదనంగా రెండు వాహనాలు అందుబాటులో ఉండేవి. ప్రతిరోజూ తెల్లవారుజామున 5గంటలకే ఇంటి ముంగిటకు వాహనాలు వచ్చి చెత్త సేకరించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. వాహనాలు 40 కంటే తక్కువగానే ఉన్నాయి. అందులో కొన్ని రిపేర్లుకు గురికావడం, డ్రైవర్లు సరిగా లేకపోవడం, వాహనాలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వంటి ఇబ్బంది వల్ల పారిశుద్ధ్యం పడకేసింది. తడి చెత్తకు వేరేగా...పొడి చెత్తకు వేరేగా డస్ట్‌బిన్‌లు కార్పొరేషన్ సరఫరా చేసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు ఫోటోలకు ఫోజులిచ్చి మమా అనిపించేస్తున్నారు తప్ప పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడం లేదని నగరవాసులు మండిపడుతున్నారు.

ఆమదాలవలస మున్సిపాలిటీలో..



ఆమదాలవలస లక్ష్మినగర్ వీధి శివారులో చెత్తకుప్ప

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ, మన్నయ్యపేట, సప్తపురాలు, లక్ష్మిడిపేట, వెంకయ్యపేట, తిమ్మాపురం, గేదెలవానిపేట, ఊసవానిపేట, పూజారిపేట, లక్ష్మినగర్ వీధి తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పూజారిపేట నుయ్యివీధి శివారులో మురికి కూపం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక కుక్కల సంగతి సరేసరి. రోడ్డుపైకి రావాలంటేనే జనం హడలిపోతున్నారు.

క్లుప్తంగా

రీల్స్ విజేతలకు బహుమతులు

• కలెక్టర్ డా.ఎన్. ప్రభాకరరెడ్డి



విజేతల వివరాలను వెల్లడిస్తున్న కలెక్టర్ డా.ఎన్ ప్రభాకరరెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ఉత్తమ వీడియో రీల్స్ రూపొందించిన ఐదుగురు విజేతలకు కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి నగదు బహుమతులను ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన 48 వీడియోల నుంచి వారిని ఎంపిక చేసినట్లు ఆయన బుధవారం తెలిపారు. విజేతలలో పార్వతీపురానికి చెందిన మత్రి రవికి ప్రథమ బహుమతి(రూ. 5,000), సాలూరు మండలానికి చెందిన కోన మహేష్‌కు ద్వితీయ(రూ. 3,000), బహుమతి, సీతంపేటకు చెందిన కె.టెండూల్కర్‌కు తృతీయ (రూ.2,000) బహుమతి లభించాయి. అలాగే, మహతో ఇంద్రాణికి కన్సొలేషన్ బహుమతి, పట్టాభి అనిల్ కుమార్‌కు సోషల్ మీడియా అంబాసిడర్‌గా ప్రత్యేక పురస్కారం దక్కింది. త్వరలోనే వారికి బహుమతి ప్రదానం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్‌ఓ కె.హేమలత పాల్గొన్నారు.

19న అండర్-13 చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 19న అండర్-13 విభాగంలో బాలబాలికలకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం అధ్యక్షుడు కేకే జగన్నాథ్ బుధవారం తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోలింగ్ ట్రోఫీలో భాగంగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ట్రోఫీలో భాగంగా అండర్ -7 నుంచి అండర్ -19 విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని వెల్లడించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు క్రీడాకారులకు తుది దశ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు ఫోన్ 74166 66567 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్ట్


గంజాయి నిందితులతో జీఆర్పీ ఎస్సై బాలాజీరావు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: మూడు కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను విజయనగరం జీఆర్పీ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ సిబ్బంది, విజయనగరం జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా పార్వతీపురం నుంచి విజయనగరం వస్తున్న ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా కేరళ రాష్ట్రంలోని అల్పుజ జిల్లాకు చెందిన సుని, గోవిందరాజులు ఒడిశాలోని మునిగూడ నుంచి కేరళకు అక్రమంగా 3 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ సందర్భంగా బలిజిపేట పోలీసులు ఆ ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని జీఆర్పీకి అప్పగించారు. జీఆర్పీ ఎస్సై బాలాజీరావు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ నిమిత్తం రైల్వే కోర్టుకు తరలించారు.

చంపావతిలో వ్యక్తి గల్లంతు


కనకల అప్పారావు

నెల్లిమర్ల: స్థానిక చంపావతి నదిలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. దీనిపై బుధవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జరజాపు పేటకు చెందిన కనకల అప్పారావు(46) భవన నిర్మాణ పనులు చేస్తూ పని లేని సమయంలో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు వంటలు చేయడానికి వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో థామస్ పేట గ్రౌండ్‌లో పెళ్లి ఫంక్షన్ వంటకు సహచరుడు కిల్లంపల్లి రాజుతో వెళ్లి వంట పూర్తయిన తరువాత ఇద్దరూ చంపావతి నదిలో స్నానికి దిగారు. రాజు ఒడ్డుకు చేరుకోగా అప్పారావు గల్లంతయ్యాడు. కాగా ఆ ప్రదేశంలో లోతుతో పాటు ఊబి కూడా ఉండడంతో గల్లంతవడంతో స్థానికులు, ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది దిగి వెతికినా అప్పారావు ఆచూకీ లభ్యం కాలేదు. అప్పారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఏపీఎంగా బాధ్యతల స్వీకరణ

భోగాపురం: భోగాపురం మండల వెలుగు సమాఖ్య ఏపీఎంగా పి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా కేంద్రంలో ఏపీఎంగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏపీఎంగా ఇక్కడ విధులు నిర్వహించిన జగదీష్‌కుమార్ బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లారు.

మత్తులో ఉంచి వైద్యం

- వైద్యరంగంలో అధిక ప్రాధాన్యం
- ఏడాదిలో లక్ష మంది వరకు రోగులకు ఎనస్థీషియా
- నేడు ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం


శస్త్రచికిత్సలో పాల్గొన్న మత్తు వైద్యులు

విజయనగరం ఫోర్ట్: వైద్యరంగంలో కొన్నేళ్ల క్రితం వరకు మత్తు వైద్యుల గురించి ప్రజలకు పెద్దగా తెలియదు. కోవిడ్ మహమ్మారి తీవ్రస్థాయిలో విజృంభిస్తున్న సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న కోవిడ్ రోగులకు చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడడంతో మత్తు వైద్యులకు గుర్తింపు వచ్చింది. సమాజంలో మత్తు వైద్యులు అంటూ ఉన్నారన్న విషయం అందరికీ తెలిసింది. గురువారం ప్రపంచ మత్తు వైద్య దినోత్సవం (వరల్డ్ ఎనస్థీషియా డే) సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. పూర్వ కాలంలో తలమీద, ముక్కు దగ్గర మూలికలు పెట్టి మత్తు వచ్చేలా చేసి చికిత్స అందించేవారు. గతంలో మత్తు వైద్యవిద్యను అభ్యసించడానికి పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. మత్తు వైద్యులు కూడా చాలా తక్కువగా ఉండేవారు. మత్తు విభాగంలో ఆధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి రావడంతో ఇటీవల మత్తు వైద్యవిద్యను అభ్యసించే వారి సంఖ్య పెరుగుతోంది. మత్తు వైద్యులకు ప్రాధాన్యం పెరిగింది. ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు నిలబెట్టడంలో మత్తు వైద్యులు కీలక పాత్ర పోషిస్తారు.

శస్త్రచికిత్సలో కీలక పాత్ర

ఏదైనా వ్యాధికి శస్త్రచికిత్స చేయాలంటే మత్తు వైద్యులదే కీలక పాత్ర. సంబంధిత వ్యాధికి ఎంత మోతాదులో మత్తు ఇవ్వాలో అంతే మత్తు ఇవ్వాల్సి ఉంటుంది. మోతాదుకు మించి మత్తు ఇచ్చినట్లయితే రోగి ప్రాణాల మీదకు వస్తుంది. ఎముకల సంబంధిత, ఈఎన్‌టీ, గైనిక్, డెంటల్ శస్త్రచికిత్సలకు, కడుపునొప్పి, అపెండిసైటిస్, పేగుఒరుపు, హెర్నియా, హైడ్రాసిల్, పైల్స్, కేన్సర్, న్యూరోసర్జరీ, గుండె సంబంధిత శస్త్రచికిత్సలకు మత్తు ఇస్తారు. ముఖ్యంగా గుండె మార్పిడి, కాలేయం మార్పిడి, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో మత్తు వైద్యుల పాత్ర అత్యంత కీలకం. ఈ శస్త్రచికిత్సలు చేసేటప్పుడు ప్రతి సెకెను గుండె ప్రతి స్పందనను గమనిస్తూ మత్తు వైద్యులు ఉండాలి. అదేవిధంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నవారికి, పురుగు మందు తాగి క్లిష్టపరిస్థితుల్లో ఉన్న వారికి కూడా మత్తు వైద్యులు మత్తు ఇచ్చి చికిత్స అందిస్తారు. వెంటిలేటర్‌పై ఉన్న రోగులకు, ఐసీయూ నిర్వహణ కూడా మత్తు వైద్యులే చూస్తారు.

జిల్లాలో విధుల్లో 100 మంది వైద్యులు

గతంలో మత్తు వైద్యులు తక్కువగా ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య పెరిగింది. జిల్లాలో 100 మంది వరకు మత్తు వైద్యులు ఉన్నారు. వారిలో 70 నుంచి 80 మంది ప్రాక్టీస్ చేస్తున్నారు. సర్వజన ఆస్పత్రిలోనే ఏడాదికి 12 వేల మంది వరకు రోగులకు మత్తు ఇస్తారు. జిల్లావ్యాప్తంగా ఏడాదికి లక్ష మంది వరకు రోగులకు మత్తు ఇస్తారు.

మత్తు వైద్యులకు గుర్తింపు వచ్చింది:



గతంలో మత్తు వైద్యులకు అంత ప్రాధాన్యం ఉండేది కాదు. తెరవెనుకనే వారి పాత్ర ఉండేది. కోవిడ్ రోగులకు సేవలు అందించిన తర్వాత మత్తు వైద్యులకు ప్రాధాన్యం, గుర్తింపు వచ్చింది. గతంలో మత్తు వైద్యులుగా చేయడానికి చాలా మంది వెనుకాడేవారు. రోగికి ఏదైనా అయితే నిందిస్తారేమోనని ముందుకు వచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు మంచి పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల మత్తు వైద్యుల పని సులభతరమైంది. మత్తు ఇవ్వడం కష్టతరమైన పని అయినప్పటికీ రోగుల ప్రాణాలు కాపాడామనే సంతృప్తి ఉంటుంది.

డాక్టర్ డి.జయధీర్‌బాబు, ప్రొఫెసర్, మత్తు విభాగం అధిపతి , ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి


గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి

• కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: పీఎంఏవై పథకం కింద మంజూరైన గృహాలను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పీఎంఏవై కింద జిల్లాలో 8,259 గృహాలు లక్ష్యం కాగా 6,873 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన 1,386 గృహాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ముందుగా అర్బన్‌లో సొంత స్థలాలు ఉన్న వారి గృహాలను పూర్తి చేయాలన్నారు. రూఫ్ లెవెల్‌లో ఆర్‌సీ స్థాయిలో ఉన్నవి పూర్తి కావాలని ఇకపై ప్రతి వారం సమీక్షించనున్నట్లు తెలిపారు. కాలనీలలో నిర్మాణాలకు అనువుగా ఉన్న వాటిని గుర్తించి అందుకు ఎంతమేరకు భూమి అవసరం అవుతుందో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ మురళీ ప్రసాద్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై దాడి


ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన కాపీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీకి సానుభూతి పరులు, తండ్రీకొడుకులైన అలమండ సత్యం, అలమండ నారాయణరావులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులు మీసాల సూర్యనారాయణ, నాగమణి వారి కుమారుడు సాగర్‌తో పాటు మంత్రి అప్పలనాయుడు, బొద్దాన రాము అన్యాయంగా దాడి చేశారు. ఈ మేరకు బాధితులు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ బూడి శ్రీరాములునాయుడుతో కలిసి విజయనగరం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్‌తో వెళ్తున్న తన కుమారుడు అలమండ నారాయణరావును అడ్డుకుని తొలుత దాడి చేశారని, కుమారుడు తప్పించుకుని పారిపోగా, పొలంలో పని చేస్తున్న తనను ఇంటికి తీసుకువచ్చి బంధించి విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారని తండ్రి అలమండ సత్యం ఫిర్యాదు చేశాడు. టీడీపీ మాజీ ఎంపీటీసీ ఇంటిలో బందీగా ఉన్న తనను పోలీసులు వచ్చి విడిపించగా చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేయించుకున్నానని, పోలీసులు ఆస్పత్రిలో వివరాలు తీసుకుని కేసు నమోదు చేశారని తెలిపారు. పాత కక్షలతో ప్రణాళిక ప్రకారం తండ్రీకొడుకులైన తమపై దాడి చేసి గాయపరిచారని, గ్రామంలో ఎలా తిరుగుతారో చూస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'శౌర్యం స్మృతి' బ్రోచర్ల ఆవిష్కరణ


బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ దామోదర్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత, యాంకర్ నాగరాజు

విజయనగరం క్రైమ్: పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవం సందర్భంగా, విజయనగరం జిల్లా పోలీసు డివిజన్ పరిధిలో పోలీస్ శాఖ చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో 'శౌర్యం' (తెలుగు) 'స్మృతి' (ఆంగ్లం) పేరుతో రూపొందించిన అమరవీరుల స్మారక బ్రోచర్లను ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 'అమరవీరుల సేవా తపస్సుకు ఈ సాహిత్య నివాళి ప్రతి పోలీసు సిబ్బందిలో ధైర్య స్ఫూర్తిని నూరిపోస్తుందన్నారు. అమరవీరుల కుటుంబాలకు గౌరవాన్ని చాటుతుందని చెప్పారు. ఈ ప్రయత్నం రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాస్థాయి పోలీసు విభాగం ఆధ్వర్యంలో అధికారికంగా ప్రారంభం కావడం విశేషమన్నారు.. భవిష్యత్‌లో ఇది తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ప్రేరణారూపంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ప్రముఖ యాంకర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం


సోమరాజు (ఫైల్)


సోమరాజు మృతదేహం

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గ్రామాల మధ్య ఉన్న గెడ్డలో కొట్టుకుపోయిన ఆర్.వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు(54) మృతదేహం బుధవారం లభ్యమైంది. విజయనగరంలోని పీడబ్ల్యూ మార్కెట్‌లో కిరాణా హోల్‌సేల్ దుకాణంలో విధులు ముగించుకుని సోమవారం రాత్రి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వసంత గ్రామానికి సోమరాజు వెళ్తుండగా చంద్రంపేట దాటిన తర్వాత గెడ్డ దాటుతూ కొట్టుకుపోయాడు. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి మంగళవారం గాలింపు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో గెడ్డలో మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వసర్వజన ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

రహదారులపై చెత్త కనిపించరాదు

• కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి

పార్వతీపురం రూరల్: పార్వతీపురం, సాలూరు పట్టణంలోని రహదారులు శుభ్రంగా ఉండాలని, ఎక్కడా చెత్త కనిపించరాదని కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ప్రతి వార్డులో పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు. నిరంతరాయంగా తాగునీటి సరఫరా చేయాలని, పరిపాలనలో పూర్తిస్థాయి 'ఈ-ఆఫీసు' విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ ఆదా కోసం సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని, రోడ్లపై నిరుపయోగంగా ఉన్న వాహనాలను తొలగించాలని ఆదేశించారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: అత్యవసర సమయాల్లో ప్రాణాలను రక్షించే సీపీఆర్ గురించి ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కారణాల రీత్యా ఒక వ్యక్తి గుండె కొట్టుకోవడం, శ్వాస ఆగిపోయినప్పుడు అతని ప్రాణాలు రక్షించడానికి సీపీఆర్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మత్తు విభాగం అధిపతి డాక్టర్ జయధీర్‌బాబు, అత్యవసర విభాగం హెచ్‌వోడీ డాక్టర్ శివప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శివ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన బోనుల లక్ష్మణ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతడిది పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బాధితుడికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం పోలిపల్లిలోని తన స్వగృహంలో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో పిడుగు వెంకటసత్యం, పొలపర్తి లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

నెల్లిమర్ల: స్థానిక మిమ్స్‌లో సీపీఆర్ (హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం) పై సామాన్యులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనస్థీషియా (మత్తు) విభాగాధిపతి డా. అన్నపూర్ణ శర్మ మాట్లాడుతూ ఒక వ్యక్తికి గుండె కొట్టుకోవడం లేదా శ్వాస తీసుకోవడం ఆగిపోయినప్పుడు, ప్రాణాలను రక్షించడానికి చేసే అత్యవసర ప్రక్రియ ఇది అని పేర్కొన్నారు. దీనిపై సామాన్య ప్రజలకు, నర్సింగ్, వైద్య విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమిషనర్ టి.జయరాం కోరారు. నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం అనధికార లేఅవుట్ల వివరాలు నోటీసు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం మాట్లాడుతూ అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని యజమానులు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైద్య విద్య వ్యాపారం కాదు!


సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ బాధ్యతలు వదిలేసి వైద్యవిద్యా వ్యవస్థను వ్యాపారుల చేతుల్లోకి నెట్టొద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు బుధవారం జెడ్పీ మినిస్టీరియల్ భవనంలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు యూ.ఎస్. రవికుమార్ అధ్యక్షతన ప్రజా సంఘాల ప్రతినిధులు, వైద్యులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైద్య రంగాన్ని పీపీపీ మోడల్ పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులతో స్థాపించిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం పేద విద్యార్థులకు, ప్రజారోగ్యానికి భారీ దెబ్బ పడుతుందని పేర్కొన్నారు. వైద్యవిద్య ఫీజులు ఆకాశాన్నంటుతాయని, పేద విద్యార్థులకు డాక్టర్ కావాలనే కల దూరమవుతుందని, రిజర్వేషన్లు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడం వల్ల పేదలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. గ్రామీణ పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, నాగమనోహర్, ఫైజల్, సురేష్ బాబు, రాజగోపాల్, వెంకటరావు, దివాకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో 'హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించాలి

• ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలు ఆందోళనకరమని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దారుణాలు జరుగుతున్నాయని, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముvvల అమర్‌నాథ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడం, అపరిశుభ్ర వాతావరణం, సిబ్బంది లేమి వంటి కారణాలతో హాస్టళ్లలో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారన్నారు. రెండేళ్ల క్రితం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రతి హాస్టల్‌కు ఒక ఏఎన్‌ఎంను నియమించి ఉంటే ఈ మరణాలు సంభవించేవి కావన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను సేకరించి, పౌష్టికాహారంతో కూడిన కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైతే, విద్యార్థుల మరణాలను ప్రభుత్వ హత్యలుగానే పరిగణిస్తామని అమర్‌నాథ్ తీవ్రంగా హెచ్చరించారు.

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి


యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పుష్యమి నక్షత్రం సందర్భంగా పూర్ణాహుతి హోమాన్ని ఆలయ అర్చకులు బుధవారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామిని ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక సర్గ హవనం విన్నవించి పూర్ణాహుతి చేపట్టారు. తరువాత వెండి మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈడీ దృష్టికి ఉద్యోగుల సమస్యలు


వినతిపత్రాన్ని అందుకుంటున్న విజయనగరం జోనల్ ఈడీ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి

విజయనగరం అర్బన్: ఆర్టీసీ విజయనగరం జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి దృష్టికి విజయనగరం జోన్ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యలను ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ తీసుకెళ్లింది. ఈ మేరకు బుధవారం సంఘం ప్రతినిధులు స్థానిక జోనల్ ట్రైనింగ్ కాలేజీ సమావేశ మందిరంలో ఆయనను కలిసి తమ సమస్యల పత్రాన్ని అందజేశారు. జోన్ పరిధిలోని 6 జిల్లాలు, 19 డిపోలు, జోనల్ వర్క్‌షాప్‌లకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి బస్సుల్లో డ్రైవర్లు, కండక్టర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. జోన్‌లో ప్రమోషన్లు ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని, రన్నింగ్ టైమ్ తగినవిధంగా లేవని, రికవరీలు, రెస్ట్ రూమ్‌లు, డ్యూటీ చార్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాడేరు డిపోలో నివాస గృహాల అద్దె సమస్య, టీమ్ రికవరీలు, రెస్ట్ రూమ్‌లు, డ్యూటీ చార్టులు వంటి పలు సమస్యలు ఉన్నాయిని వినతిపత్రంలో తెలియజేశారు. కొన్ని జిల్లాల్లో అక్రమంగా ఇస్తున్న ఓడీలు, ఉద్యోగుల సీనియార్టీలో తేడాలు, రూట్ సర్వేలు, మంచినీటి సదుపాయాలు, ఇంక్రిమెంట్లు లభించకపోవడం వంటి 30కు పైగా సమస్యలను వినతిపత్రంలో వివరించారు. ఈడీని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వెంకటరావు, జోనల్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జోనల్ కార్యదర్శి బీకేమూర్తి, జోనల్ కోశాధికారి కేఎస్ఎస్‌మూర్తి, జిల్లా కార్యదర్శి రవికాంత్ ఉన్నారు.

మద్యంమత్తులో పోలీస్ స్టేషన్‌పై దాడి


దాడిలో ధ్వంసమైన స్టేషన్‌లోని కంప్యూటర్ టేబుల్

• 17 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో శాంతిభద్రతలకు పూర్తిగా విఘాతం కలిగించేలా కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో విధ్వంసం సృష్టించారు. ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీస్‌స్టేషన్‌పైనే ఆకతాయిలు మద్యం మత్తులో దాడికి తెగబడడం, విధుల్లో ఉన్న సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం , పోలీస్ సిబ్బంది కాలర్ పట్టుకుని, కత్తులతో బెదిరించే స్థాయికి చిల్లర మూకలు చెలరేగిపోయాయి. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

ఘర్షణతో మొదలై..ఫిర్యాదుకు వచ్చి..విధ్వంసం..

పార్వతీపురం పట్టణంలో మంగళవారం రాత్రి దేశాలమ్మ తల్లి వారాల పండగ అత్యంత వైభవంగా జరుగుతోంది. ఈ క్రమంలో ఇందిరా కాలనీ, లింగం వీధికి చెందిన యువకుల మధ్య ఘర్షణ, కొట్లాట తలెత్తాయి. ఈ గొడవపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు లింగం వీధి వాసులు ప్రయత్నించారు. అయితే, అత్యవసర సేవలకు కేటాయించిన 'డయల్ 100'కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లైన్ కలవకపోవడంతో మద్యం మత్తులో ఉన్న కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసుల నుంచి స్పందన లేదని ఆరోపిస్తూ, అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగం వీధికి చెందిన కొందరు స్థానికులు, యువకులు మద్యం మత్తులో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారు, ఆవేశంతో ఊగిపోతూ స్టేషన్ గేట్లను బలంగా తన్నారు. విధుల్లో ఉన్న సెంట్రీ సిబ్బందిని దుర్భాషలాడుతూ, వారిపైకి దూసుకెళ్లారు. స్టేషన్‌లోని కంప్యూటర్ టేబుల్‌పై ఉన్న అద్దాన్ని ముక్కలు చేసి విధ్వంసం సృష్టించారు. అంతటితో ఆగకుండా, విధి నిర్వహణలో ఉన్న ఒక సిబ్బంది కాలర్ పట్టుకుని లాగి, రైటర్ కుర్చీలో కూర్చుని వీరంగం సృష్టించారు. వారిలో ఒక యువకుడు ఏకంగా కత్తిని చేతబట్టి స్టేషన్‌లోని సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడంతో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన పట్టణ పోలీసులు, దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని, 17 మందిపై కేసు నమోదు చేశారు. 'డయల్ 100' సేవలు అందుబాటులో లేకపోవడం వ్యవస్థ వైఫల్యమే అయినప్పటికీ, దానిని సాకుగా చూపి ఏకంగా పోలీస్ స్టేషన్‌పైనే దాడి చేయడం సమంజసం కాదని, లా అండ్ ఆర్డర్‌ను పటిష్టంగా అమలు చేసి, శాంతిభద్రతలను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.